

ఆదివాసీ మాతృ భాష విద్యా వలంటీర్లకు గ్రీన్ సిగ్నల్

పాడేరురూరల్, జూలై 2: మన్యంలోని మారుమూల గిరిజన గ్రామాల్లోని పాఠశాలల్లో బోధించే మాతృ భాష విద్యా వలంటీర్లను తీసుకో వాలని గిరిజన సంక్షేమ శాఖ నుంచి ఉత్తర్వులు అందాయని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ ఒక ప్రకటనలో తెలిపారు. వలంటీర్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్, ఎంఈవోలకు ఐటీడీఏ పీవో అభిషేక్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి, రాష్ట్ర విద్యాశాఖ, ఐటీడీఏ, జిల్లా అధికారులకు విద్యావలంటీర్ల సంఘం జిల్లా నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

అరకు కాఫీ ఘుమఘుమలు

సేంద్రీయ పద్ధతుల్లో సాగు చేయడం వల్ల ప్రపంచ స్థాయి గుర్తింపు

- ఏజెన్సీ వ్యాప్తంగా 2,72,00 ఎకరాల్లో సాగు
- 2,36,618 మంది గిరి రైతులకు లబ్ధి
- తాజాగా మన్‌కీ బాత్‌లో అరకు కాఫీ ప్రత్యేకతను ప్రస్తావించిన ప్రధాని మోదీ

(పాడేరు- ఆంధ్రజ్యోతి)

ప్రధాని నరేంద్రమోదీ గత ఆదివారం మన్‌కీ బాత్ కార్యక్రమంలో ప్రత్యేకంగా ప్రస్తావించడంతో 'అరకు కాఫీ' మరోమారు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. రసాయనిక ఎరువులను వినియోగించకుండా సేంద్రీయ పద్ధతుల్లో సాగు చేయడం వల్లే మన్యం కాఫీకి ప్రపంచస్థాయి గుర్తింపు లభించింది. దేశంలో కాఫీ సాగులో కర్ణాటక తర్వాత స్థానం ఆంధ్రప్రదేశ్‌దే. కేవలం గిరిజనులు సాగు విధానంతోనే అరకు కాఫీకి అంతర్జాతీయ స్థాయిలో బ్రాండ్ ఇమేజ్ వచ్చింది.



కాఫీ పండ్లు సేకరిస్తున్న గిరిజన రైతు



1989 నుంచి మన్యంలో కాఫీ సాగు

గిరిజనులు పోడు వ్యవసాయంపై ఆధారపడి అడవులను నాశనం చేయకుండా ఉండేందుకు 1989లో ఏజెన్సీకి కాఫీ సాగును ప్రభుత్వం పరిచయం చేసింది. 1989 నుంచి 2002 వరకు 32,072 ఎకరాల్లో కాఫీ తోటలు అభివృద్ధి జరగ్గా, 2003 నుంచి 2008 వరకు 64,265 ఎకరాల్లో తోటలు వేశారు. ఆ తర్వాత 2009లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్తంగా కాఫీ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టాయి. దీంతో 2009 నుంచి 2016 వరకు 61,684 ఎకరాల్లో, 2016 నుంచి ఇప్పటివరకూ 84 వేల ఎకరాల్లో కాఫీ తోటలను అభివృద్ధి చేశారు. ఇలా ప్రభుత్వాల ప్రోత్సాహంతో ఏజెన్సీవ్యాప్తంగా సుమారు 2,42,021 ఎకరాల్లో కాఫీ సాగు చేస్తున్నారు. ఆయా తోటల ద్వారా 2,36,618 మంది గిరిజన రైతులు లబ్ధిపొందుతున్నట్టు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఇవి కాకుండా గిరిజన రైతులు తమ వారసత్వ భూముల్లో సొంతంగా కాఫీ సాగు చేస్తున్నారు. అదొక 30 వేల ఎకరాలు ఉంటుంది. మొత్తం 2,72,000 ఎకరాల్లో కాఫీ తోటలున్నాయి. అయితే వాటిలో సుమారు లక్షా 52 వేల ఎకరాల్లో మాత్రమే ఏడాదికి 71 వేల టన్నుల కాఫీ పండ్ల దిగుబడి వస్తుందని అంచనా. ఏడాదికి ఒక ఎకరా కాఫీ తోటతో సుమారు 40 నుంచి 50 వేలు ఆదాయం సమకూరుతున్నది. దీంతో కాఫీ తోటల పెంపకంపై గిరిజన రైతులు ఆసక్తి చూపుతున్నారు.



సేంద్రీయ పద్ధతిలో ఉత్పత్తి అయిన కాఫీ పళ్లు


టీడీపీ హయాంలో రూ.526 కోట్లతో ప్రత్యేక ప్రాజెక్టు

2014లో సంభవించిన హుద్‌హుద్ తుఫాన్‌కు భారీ స్థాయిలో కాఫీ తోటలు ధ్వంసమయ్యాయి. దీంతో కాఫీ రైతులను ఆదుకునేందుకు 2015 నుంచి 2025 వరకు లక్ష ఎకరాల కాఫీ తోటల అభివృద్ధికి అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం రూ.526 కోట్లతో ఒక ప్రత్యేక ప్రాజెక్టును మంజూరుచేసింది. ఈ ప్రాజెక్టులో భాగంగా అప్పటి నుంచి ఇప్పటివరకూ 84 వేల ఎకరాల్లో తోటలు అభివృద్ధి చేశారు. ఇదిలావుండగా 2016లోనే మన్యం కాఫీని చంద్రబాబు నాయుడు 'అరకు కాఫీ'గా ప్రపంచానికి పరిచయం చేసి ప్రమోట్ చేశారు. అదేఏడాది దేశ ప్రధాని మోదీతో పాటు అనేక మంది ప్రముఖులు అరకు కాఫీని సేవించి అద్భుతమంటూ ప్రశంసించారు. దీంతో ప్రపంచవ్యాప్తంగా అరకు కాఫీ మరింతగా ప్రాచుర్యం పొందింది.

కాఫీ పండ్ల విక్రయానికే గిరి రైతులు మొగ్గు

ఏజెన్సీలో గిరిజన రైతులు కాఫీ పండ్లను విక్రయించడానికే అధికంగా మొగ్గు చూపుతున్నారు. గతంలో పండ్లను పార్చిమెంట్ (పప్పు)గా చేసి విక్రయించేవారు. అయితే పార్చిమెంట్ ధర తక్కువగా ఉండడంతో ప్రస్తుతం పండ్లనే విక్రయించేందుకు రైతులు సిద్ధపడుతున్నారు. ఆరు కిలోల కాఫీ పండ్లను శుద్ధి చేస్తే ఒక కిలో పార్చిమెంట్ వస్తుంది. ప్రస్తుతం పండ్లు ... మిగతా 8వ పేజీలో

పుడమిపై పచ్చ తివాచీ



పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కలెక్టరేట్‌కు మధ్యలో పచ్చదనం ప్రకృతి ప్రియులను విశేషంగా ఆకట్టుకుంటున్నది. సహజంగా పంట భూముల్లో నాట్లు వేసిన తరువాత పచ్చదనం దర్శనమిస్తుంది. కానీ అందుకు భిన్నంగా ఆయా భూముల్లో ఎటువంటి పంటలు వేయకుండానే పచ్చదనం ఆకర్షణీయంగా ఉండడం విశేషం. ఆ దృశ్యాన్ని 'ఆంధ్రజ్యోతి' కెమెరాలో బంధించింది. - ఆంధ్రజ్యోతి/పాడేరు

పాఠశాలల్లో వసతులపై ఆరా

పలు పాఠశాలలను తనిఖీ చేసిన డీఈవో

సీలేరు, జూలై 2: జీకే వీధి మండలం సీలేరులోని పలు పాఠశాలలను డీఈవో బ్రహ్మాజీరావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా సీలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి అక్కడ వసతులపై ఆరా తీశారు. అనంతరం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల, బాలుర గురుకుల పాఠశాలను సందర్శించారు. బాలికల ఆశ్రమ పాఠశాలలో తరగతి గదికి వెళ్లి విద్యార్థినుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పాఠ్య పుస్తకాలు అందాయా? అని ఆరా తీశారు. పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉందని ఆయనకు విద్యార్థినులు తెలిపారు. సరిపడా తరగతి గదులు, ఉపాధ్యాయులు లేకపోవడంతో మూడు నుంచి ఆరో తరగతి వరకు ఒకే గదిలో ఉంచి విద్యా బోధన చేస్తున్నట్టు డీఈవోకి ఉపాధ్యాయులు తెలిపారు. తరగతి గదులు సరిపడా లేకపోతే 10వ తరగతికి అప్‌గ్రేడ్ చేయాలంటూ ఏ విధంగా ప్రతిపాదనలు పంపించారని బాలికల ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎంను డీఈవో ప్రశ్నించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యలో జిల్లా రాష్ట్రంలోనే తొమ్మిదవ స్థానంలో ఉందని చెప్పారు.



మాట్లాడుతున్న డీఈవో బ్రహ్మాజీరావు

ఎక్కడైనా ఉపాధ్యాయుల కొరత ఉంటే సర్దుబాటు చేసి పాఠశాలలు మూత పడకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. జిల్లాలో 22 మండలాల్లో 260 పాఠశాలకు భవనాల నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు.

దశల వారీగా సమస్యల పరిష్కారం

మారుమూల గ్రామ వాసులకు కలెక్టర్ హామీ

- పలు ప్రాంతాల్లో విస్తృత పర్యటన

ముంచంగిపుట్టు, జూలై 2: మారుమూల ఆదివాసీ గ్రామాల్లో దశలవారీగా సమస్యలు పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ తెలిపారు. మండలంలో ఆయన మంగళవారం మారుమూల కుమడ, బూసిపుట్టు పంచాయతీల్లో పర్యటించారు. ఆయా పంచాయతీల పరిధిలో గల గిరిజనులతో మాట్లాడి అక్కడ నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దిగువ కుమడలో చిన్నపాటి పాకలో నిర్వహిస్తున్న ప్రాథమిక పాఠశాలను, రికార్డులను, పిల్లల హాజరును ఆయన పరిశీలించారు. పిల్లలు కనీసం కూర్చునేందుకు భవనం లేక ఇబ్బందులు పడుతున్నారని, పాఠశాల భవన నిర్మాణ పనులు జరిగే విధంగా చూడాలని స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. త్వరలో భవన నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యే విధంగా చూస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. అక్కడ నుంచి కలెక్టర్ బూసిపుట్టు వెళ్లారు. అక్కడ గిరిజనులతో మాట్లాడారు. బూసిపుట్టులో తాగునీటి సమస్య పరిష్కరించాలని, సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని, పంచాయతీ పరిధిలో దీర్ఘకాలంగా నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఆ ప్రాంతీయులు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లడంతో పాటు ఆయా సమస్యలపై వినతి పత్రాలను అందించారు. అలాగే బూసిపుట్టులో గల జీయూపీ, జీటీడబ్ల్యూ బాలుర పాఠశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు గ్రామస్థులు విన్నవించుకున్నారు. ఆయా పాఠశాలలకు సంబంధించి తరగతి, వసతి భవనాలను నిర్మించాలని, వంటశాలను ఏర్పాటు చేయాలని, ఉపాధ్యాయులకు నివాస గృహాలు నిర్మించాలని, తాగునీటి సమస్య పరిష్కరించాలని కలెక్టర్ దృష్టికి స్థానికులు తీసుకువెళ్లారు. ఆయన వెంట ఎంపీడీవో కిరణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.



ముంచంగిపుట్టు మండలం దిగువ కుమడ ప్రాథమిక పాఠశాల రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్

పెదబయలు మండలంలో..

పెదబయలు: మండలంలోని మారుమూల గిరిజన గ్రామాల్లో మంగళవారం కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ సుడిగాలి పర్యటన ... మిగతా 8వ పేజీలో

పింఛన్ల పంపిణీలో జిల్లాకు నాలుగో స్థానం

- 99.15 శాతం పంపిణీ

పాడేరు, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీలో రాష్ట్రంలో జిల్లా నాలుగో స్థానంలో నిలిచింది. మంగళవారం నాటికి 99.15 శాతం పంపిణీ పూర్తయింది. జిల్లాలో 22 మండలాల్లో మొత్తం 1,26,813 మంది సామాజిక పెన్షన్ల లబ్ధిదారులున్నారు. తొలి రోజు సోమవారం వారిలో 90 శాతం మంది అంటే 1,14,332 మందికి పింఛన్లు పంపిణీ చేశారు. సచివాలయ ఉద్యోగులు, ఎంపీడీవోలు, వెలుగు సిబ్బంది పెన్షన్ల పంపిణీ ప్రక్రియలో చురుగ్గా పాల్గొన్నారు. రెండవ రోజైన మంగళవారం సాయంత్రానికి మొత్తం 1,25,737 మందికి పింఛన్ల సొమ్ము అందించారు. పింఛన్ల పంపిణీని విజయవంతం చేసిన అందరికీ కలెక్టర్ దినేశ్‌కుమార్ అభినందనలు తెలిపారు.

రాగల ఐదు రోజుల్లో తేలికపాటి వర్షాలు

చింతపల్లి, జూలై 2: జిల్లాలో రాగల ఐదు రోజుల్లో తేలికపాటి వర్షాలు కురుస్తాయని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు మంగళవారం రాగల ఐదు రోజుల వాతావరణ సమాచారాన్ని ప్రకటించారు. ఈ నెల 7వ తేదీ వరకు పాడేరు, అరకు, చింతపల్లి, రంపచోడవరం డివిజన్ల పరిధిలో కనిష్ఠంగా 2 ఎంఎం, గరిష్ఠంగా 12 ఎంఎం వర్షపాతం నమోదవుతుందన్నారు. నైరుతి రుతు పవనాలు వేగవంతం కావడం వల్ల వర్షాలు పడనున్నాయని, రైతుల నారుమడులు, పంటల్లో మురుగునీరు పోయేందుకు బోదెలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. వర్షాల వల్ల పురుగుల ఉధృతి ఎక్కువగా ఉంటుందని, రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.

దూర విద్యలోనూ ఇష్టారాజ్యం

పరీక్షా కేంద్రాలు భారీగా పెంపు

- గతంలో 50, ఇప్పుడు 100
- పరీక్షా కేంద్రాలుగా ఎంపిక చేసిన కాలేజీల నుంచి భారీగా డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు
- బయటి నుంచి వచ్చి చేరిన అధికారే
- చక్రం తిప్పినట్టు విమర్శలు
- అప్పటి ఏయూ ఉన్నతాధికారుల అండదండలు
- పరీక్షల నిర్వహణలో అవకతవకలకు అవకాశం



విశాఖపట్నం, జూలై 2 (ఆంధ్రజ్యోతి): **ఆంధ్ర విశ్వవిద్యాలయం దూరవిద్యా కేంద్రం అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పరీక్షా కేంద్రాలను ఇబ్బడిముబ్బడిగా పెంచేశారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా నుంచి నుంచి అటు కృష్ణా జిల్లా వరకూ గతంలో 50 పరీక్షా కేంద్రాలు ఉండేవి. అయితే, గత ఏడాది కాలంలో ఈ సంఖ్య వందకు చేరింది. ఈ వ్యవహారంలో ప్రైవేటు కాలేజీ నుంచి డిస్టెన్స్ ఎడ్యుకేషన్ విభాగంలోకి వచ్చిన ఒక అధికారి చక్రం తిప్పినట్టు చెబుతున్నారు. ఇందుకోసం భారీమొత్తంలో డబ్బులు చేతులు మారాయన్న ఆరోపణలు కూడా ఉన్నాయి.**

విద్యార్థుల నుంచి పరీక్షల సమయంలో దండుకోవచ్చునన్న ఉద్దేశంతో అనేక కాలేజీలు దూర విద్య పరీక్షా కేంద్రాల కోసం దరఖాస్తు చేసుకుంటుంటాయి. వీటిలో తమకు కావాల్సిన కాలేజీలకు సదరు అధికారి ఎగ్జామ్ సెంటర్లు మంజూరు చేయించారని చెబుతున్నారు. అందుకు అప్పట్లో వర్సిటీలోని కొందరు అధికారులు అడ్డుచెప్పినప్పటికీ నాటి వీసీ అండదండలతో ఆయన తాను అనుకున్నది చేసేశారని చెబుతున్నారు. ఈ వ్యవహారంలో నాటి ఉన్నతాధికారులకు కూడా ముడుపులు అందినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పరీక్ష కేంద్రాల కేటాయింపులో అప్పటి డైరెక్టర్‌గా ఉన్న అధికారిని కూడా ప్రైవేటు కాలేజీ నుంచి వచ్చిన వ్యక్తి డమ్మీని చేశారన్న ప్రచారం ఉంది. ఎగ్జామ్ సెంటర్ ఏర్పాటు కోసం ఒక్కో కాలేజీ భారీగా ముట్టజెప్పాయని, దీనిపై కొత్తగా వచ్చే వైస్ చాన్సలర్, ఇతర అధికారులు దృష్టిసారించి విచా రణ జరిపించాలన్న డిమాండ్ వినిపిస్తోంది.

ఎగ్జామ్ సెంటర్‌తో మేలు

గతంతో పోలిస్తే ఏయూ దూరవిద్యా కేంద్రంలోని కోర్సుల్లో చేరుతున్న విద్యార్థుల సంఖ్య ఏటా పెరుగుతోంది. ఏటా కనీసం పది వేల నుంచి 15 వేల మంది చేరుతున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల నుంచి ఎంతోకొంత గుంజుకోవచ్చునన్న ఉద్దేశంతో కొన్ని కాలేజీలు పరీక్షా కేంద్రాల ఏర్పాటుకోసం యత్నిస్తున్నాయి. ఈ విధంగా నగర పరిధిలోని ఓ కాలేజీకి పరీక్షా కేంద్రాన్ని కేటాయించారు. విద్యార్థుల నుంచి ఆ కాలేజీ అధికారులు రూ.2 వేల నుంచి రూ.3 వేల వసూలు చేస్తున్నట్టు చెబుతున్నారు. విద్యార్థికి అవసరమైన సహకారాన్ని అందించాలంటే మరింత చెల్లించాల్సిందేనని చెబుతున్నారు. డబ్బులు ఇవ్వనివారిని ఇబ్బందులకు గురిచేస్తుంటారంటున్నారు. పరీక్షలు నిర్వహించిన ప్రతిసారి తమకు కేటాయించే విద్యార్థుల ద్వారా కొంత ఆదాయం సమకూర్చుకునేందుకు ... మిగతా 8వ పేజీలో

ఎంత నిర్లక్ష్యం..

- ధారాలమ్మ ఘాట్ రోడ్డులో చెట్టు పడి నాలుగు రోజులైనా తీసే నాథుడు కరువు
- అధికారుల తీరుపై స్థానికుల ఆగ్రహం -8లో

యర్రవరం జలపాతం రహదారికి మోక్షం

- కూటమి అధికారంలోకి రాగానే రూ.2 కోట్ల నిధులు విడుదల
- రహదారి పనులు ప్రారంభం

చింతపల్లి, జూలై 2: పర్యాటక ప్రాంతమైన యర్రవరం జలపాతం రహదారికి ఎట్టకేలకు మోక్షం కలిగింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రావడం, చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించడంతో వెను వెంటనే రహదారి నిర్మాణాలకు అవసరమైన నిధులు విడుదలయ్యాయి. టూరిజం ప్రాజెక్టులో భాగంగా రూ.2 కోట్ల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయడంతో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు రహదారి నిర్మాణ పనులు ప్రారంభించారు. దీంతో పర్యాటకులు, ప్రాంతీయ ఆదివాసీలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

చింతపల్లి మండలం గొందిపాకలు పంచాయతీ పరిధిలో యర్రవరం జలపాతం ఉంది. ఈ జలపాతానికి తురబాడుగెడ్డ నుంచి సమగిరి మీదుగా వెళ్లాలి. ఈ మార్గాన్ని ఆనుకుని సుమారు 12 గ్రామాలు ఉన్నాయి. తురబాడుగెడ్డ నుంచి సమగిరి వరకు తారురోడ్డు ఉంది. సమగిరి నుంచి యర్రవరం జలపాతం వరకు వెళ్లేందుకు కేవలం మట్టిరోడ్డు మాత్రమే ఉంది. దీంతో ఈ మార్గంపై కేవలం ద్విచక్ర వాహనాలు మినహా ఆటోలు, కార్లు, జీపులు వెళ్లే పరిస్థితి లేదు. ఈ ప్రాంత ఆదివాసీలు సైతం కాలినడకనే రాకపోకలు సాగిస్తున్నారు. శీతాకాలం సీజన్‌లో ఆంధ్రకశ్మీర్ లంబసింగికి వచ్చే పర్యాటకులు అధిక సంఖ్యలో యర్రవరం జలపాతాన్ని సందర్శిస్తుంటారు. పర్యాటకులు సమగిరి వరకు కార్లు, జీపుల్లో వచ్చి అక్కడ నుంచి కాలినడకన జలపాతానికి వెళ్లి ఎంజాయ్ చేస్తున్నారు. వర్షాకాలంలో ఈ మార్గం బురదమయమైపోతుంది. కనీసం ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లే పరిస్థితి ఉండదు. యర్రవరం జలపాతానికి రహదారిలేకపోవడం వల్ల ఆదివాసీలు, పర్యాటకులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరిస్తూ 'ఆంధ్రజ్యోతి' గతంలో వరుస కథనాలను ప్రచురించింది. అయితే వైసీపీ ప్రభుత్వం రహదారి నిర్మాణాలకు నిధులు విడుదల చేయలేదు. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో టూరిజం ప్రాజెక్టులో భాగంగా సమగిరి నుంచి యర్రవరం జలపాతం వరకు నాలుగు కిలోమీటర్లు తారు రోడ్డు నిర్మాణానికి నిధులు విడుదల చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండడంతో నిర్మాణాలకు సంబంధించి నిధులు కూడా సకాలంలో విడుదలవుతాయనే నమ్మకంతో కాంట్రాక్టర్ పనులు చేసేందుకు ముందుకొచ్చారు. ప్రస్తుతం పంచాయతీరాజ్‌శాఖ ఇంజనీరింగ్ అధికారులు ఎర్తువర్కు ప్రారంభించారు. ఎత్తువర్కు పూర్తికాగానే మెటల్, తారు రోడ్డు నిర్మించనున్నట్టు పంచాయతీరాజ్ ఏఈఈ బాలకిశోర్ తెలిపారు.



సమగిరి నుంచి యర్రవరం వరకు నిర్మిస్తున్న రహదారి

రవాణా కష్టాలు తీరతాయి



యర్రవరం జలపాతం వరకు తారు నిర్మాణ పనులు ప్రారంభంకావడంతో చాలా సంతోషంగా ఉంది. ఎన్నో ఏళ్లుగా పొరుగు గ్రామాలకు వెళ్లేందుకు రహదారి సదుపాయం లేక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నాం. జలపాతానికి వచ్చే పర్యాటకులు సైతం రహదారి సదుపాయం లేక అవస్థలు పడుతూ తీవ్ర అసహనం వ్యక్తం చేసేవారు. తారు రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు విడుదల చేయడం, పనులు ప్రారంభించడంతో రవాణా కష్టాలు తీరనున్నాయి. - **గూడెపు వరలక్ష్మి**, యర్రవరం

క్రైం... crime news

పాముకాటుతో వ్యక్తి మృతి

నర్సీపట్నం, జూలై 2: పురపాలక సంఘం బలిఘట్టంలో పాము కాటుతో వ్యక్తి మృతి చెందాడు. పట్టణ ఎస్సై ఉమామహేశ్వరరావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. బలిఘట్టం బీసీ కాలనీకి చెందిన అనకాపల్లి శ్రీనివాసరావు (45) సోమవారం రాత్రి 11.30 గంటలకు గ్రామ శివారులో బహిర్భూమి వెళ్లగా పాము కాటు వేసింది. వెంటనే ఆస్పత్రికి తీసుకు వెళ్లకుండా నిర్లక్ష్యం చేశారు. మంగళవారం ఉదయం ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లగా వైద్య సేవలు పొందుతూ శ్రీనివాసరావు మృతి చెందాడు. మృతిడి భార్య అనకాపల్లి రత్నం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

జల్సాలకు అలవాటు పడి చోరీలు

» బంగారం, నగదు స్వాధీనం

» నిందితుడిది ఏపీలోని అనకాపల్లి జిల్లా

మట్వెవాడ, జూలై 2: జల్సాలకు అలవాటు పడి, మద్యానికి, పేకాటకు బానిసై దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని మంగళవారం అరెస్టు చేసినట్టు వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో ఏసీపీ విలేకర్లతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ రాష్ట్రం అనకాపల్లి జిల్లా, కోటవురట్ల మండలం రామచంద్రపాలెంనకు చెందిన కనక రాజబాబు మద్యానికి, జల్సాలకు అలవాటు పడి 20 దొంగతనాలు చేసి, జైలుకు సైతం వెళ్లాడన్నారు. అయినా అతడిలో మార్పు రాలేదని, జూన్ 23న కాశీబుగ్గలోని వివేకానంద కాలనీలోని రెండు ఇళ్లలో, వరంగల్ బస్టాండ్‌లో దొంగతనానికి పాల్పడినట్టు పేర్కొన్నారు. వివేకానందకాలనీలో రెండు ఇళ్లల్లో చోరీకి పాల్పడి రూ.5 లక్షల నగదు, 10తులాల బంగారు ఆభరణాలు దొంగిలించినట్టు వెల్లడించారు. మంగళవారం చోరీ డబ్బులతో హైదరాబాద్ వెళ్లే క్రమంలో వరంగల్ బస్టాండ్‌లో రాజబాబు తిరుగుతుండగా పట్టుకున్నామన్నారు. అతడి నుంచి రూ.9లక్షల విలువైన బంగారు ఆభరణాలు, రూ.2 లక్షల నగదు స్వాధీనపర్చుకున్నట్టు ఏసీపీ వివరించారు. కేసును ఛేదించిన సీఐ మచ్చా శివకుమార్, ఎస్ఐ వెంకన్న, క్రైమ్ పార్టీ కానిస్టేబుల్ రవీందర్‌రెడ్డి, శివ, ఉపేందర్, రాజశేఖర్‌లను ఏసీపీ అభినందించి రివార్డులను అందజేశారు.

ఇసుక అక్రమంగా తరలించేందుకు యత్నాలు

» అడ్డుకున్న స్థానికులు.. » గస్తీ ఏర్పాటు చేస్తున్నాం : సీఐ

నక్కపల్లి, జూలై 2 : నక్కపల్లి ఇసుక డిపో వద్ద వున్న వేలాది టన్నుల ఇసుకను అక్రమంగా తరలించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారంటూ మంగళవారం రాత్రి స్థానికులు, ట్రాక్టర్ యజమానులు ఆరోపించారు. కొంతమంది వ్యక్తులు మంగళవారం ఉదయమే విజయవాడ నుంచి రెండు కార్లలో నక్కపల్లి ఇసుక డిపో వద్దకు వచ్చినట్టు స్థానికులు చెబుతున్నారు. అయితే ఎస్.రాయవరం మండలం నుంచి ఒక ఎక్స్‌కవేటర్ సాయంతో ఇసుక డిపో వద్ద ఒక బాట ఏర్పాటు చేసి, ఇసుకను తరలించేందుకు ప్రయత్నిస్తున్నారని పలువురు ఆరోపించారు. ఇసుక తరలింపునకు తమకు అనుమతులు వున్నాయని విజయవాడకు చెందిన వ్యక్తులు చెప్పి, ఇసుక తరలించేందుకు ప్రయత్నిస్తుండగా స్థానికులు అడ్డుకున్నారు. ఈలోగా విషయం తెలిసి సీఐ విజయ్‌కుమార్ అక్కడకు చేరుకున్నారు. ఇసుకపై ప్రభుత్వం నూతన పాలసీ ఇచ్చే వరకూ ఇక్కడ సిబ్బందిని గస్తీ పెడుతున్నట్టు సీఐ చెప్పారు. మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో విజిలెన్స్, మైన్స్ విభాగం అధికారులు కూడా వచ్చి ఇక్కడ ఇసుక డిపోను పరిశీలించారు.

బీజేపీ ఆర్టిజన్ సెల్ జిల్లా కన్వీనర్‌గా పవన్

కొత్తూరు, జూలై 2 : భారతీయ జనతా పార్టీ ఆర్టిజన్ సెల్ అనకాపల్లి జిల్లా కన్వీనర్‌గా కాసర్ల పవన్ నియామకమయ్యారని ఆ పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు తెలిపారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆర్టిజన్ సెల్ కో-కన్వీనర్లుగా గానుగుల బాబ్జీ, తంగేటి సత్యనారాయణలను నియమించామన్నారు. ఈ మేరకు వారికి నియామక పత్రాలు ఆయన అందజేశారు.

1,400 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

పాయకరావుపేట రూరల్, జూలై 2 : పాయకరావుపేట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది మంగళవారం మండలంలోని గోపాలపట్నం గ్రామ శివార్లలో 1,400 లీటర్ల బెల్లం పులుసును ధ్వంసం చేసినట్టు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ఎస్.ధర్మారావు తెలిపారు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈబీ హెచ్‌సీ ఎం.శంకరరావు, కానిస్టేబుళ్ళు జి.లోవరాజు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో సబ్బవరం ప్రథమం

సబ్బవరం, జూలై 2 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పింఛన్ల పంపిణీలో జిల్లాలోనే సబ్బవరం మండలం మొదటి స్థానంలో నిలిచింది. ఎంపీడీవో మహేశ్ ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది 1న సోమవారం ఉదయం 6 గంటలకు ప్రారంభించిన పింఛన్ల పంపిణీ రాత్రి 8 గంటల వరకూ సాగింది. 97 శాతం పింఛన్లు అందజేశారు. అనకాపల్లి, విశాఖపట్నం ప్రాంతాల్లో వివిధ అనారోగ్యంతో చికిత్స పొందుతున్న పింఛన్‌దార్లకు మంగళవారం అక్కడకి వెళ్లి మరీ అందజేశారు. సబ్బవరంలో అన్ని రకాల పింఛన్లు 8238 (రూ.5,43,54,500) ఉండగా 99.49 శాతం 8196 మందికి (రూ.5,40,78,500) పింఛన్లు అందించారు. మిగిలిన 42 మందిలో 28 మంది మృతి చెందగా, మరో 14 మంది అందుబాటులో లేకపోవడం వల్ల ఇవ్వలేదని ఎంపీడీవో తెలిపారు.

బీసీ హాస్టల్‌లో తల్లి కోసం మొక్క కార్యక్రమం

కొత్తూరు, జూలై 2 : అనకాపల్లి పట్టణంలోని గాంధీనగరం బీసీ హాస్టల్ ప్రాంగణంలో తల్లి కొరకు ఒక మొక్క కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ జిల్లా ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కర్రి రామకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని హాస్టల్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి ఒక మొక్కని వేయాలని మన తల్లిని గుర్తుంచుకొని తల్లి కోసం ఒక మొక్కని ప్రతి ఒక్కరూ నాటాలని కోరారు. ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్ర అచ్చంనాయుడు, అంబేడ్కర్ మండల అధ్యక్షుడు నరసింహమూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ శ్రీను, బీజేపీ నేత బి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పూరి జగన్నాథ రథయాత్ర ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం, జూలై 2: పూరి జగన్నాథ రథయాత్ర ఉత్సవాలకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లను ప్రవేశపెడుతున్నట్టు సీనియర్ డీసీఎం కే సందీప్ తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా జరిగే గుండిచా యాత్ర, బహుదా యాత్ర, సునాబేషలకు వెళ్లేవారికి ఈనెల 6వ తేదీ నుంచి రైళ్లను అందుబాటులో తెస్తున్నామన్నారు.

విశాఖ- పూరి- విశాఖ

08347 నంబరు గల రైలు ఈనెల 6, 14, 16 తేదీల్లో మధ్యాహ్నం 2.00 గంటలకు విశాఖలో బయలుదేరి రాత్రి 10.45 గంటలకు పూరి చేరుతుంది. తిరిగి ఈనెల 8, 16, 18 తేదీల్లో తెల్లవారుజాము 1.45 గంటలకు పూరిలో బయలుదేరి 10.30 గంటలకు విశాఖ చేరుతుంది. ఈ స ర్వీసులు కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి, సిగడాం, పొందూరు, శ్రీకాకుళం రోడ్డు, తిలారి, కోటబొమ్మాళి , నౌపడ, పలాస, మందస, సోంపేట, ఇచ్ఛాపురం, బ్రహ్మపూర్, ఛత్రపూర్, గంజాం, కాలికోటే, బలుగాన్, కలుపురఘాట్, నిరాకర్‌పూర్, ఖైపదార్‌రోడ్డు, అర్గుల్, హరిపురగ్రామ్ మీదుగా రాకపోకలు సాగిస్తాయి.

గుణుపూర్, పలాస, జగదల్‌పూర్, పూరి మధ్య...

08345 నంబరు గల రైలు ఈనెల 6, 14, 16న రాత్రి 11.00 గంటలకు గుణుపూర్‌లో బయలుదేరి మర్నాడు ఉదయం 4.15 గంటలకు పూరి చేరుతుంది. తిరిగి ఈనెల 7, 15, 17న రాత్రి 9.20 గంటలకు పూరిలో బయలుదేరి మర్నాడు ఉదయం 7.30 గంటలకు గుణుపూర్ చేరుతుంది. ఈ రైళ్లకు మార్గంలోని అన్ని స్టేషన్లలో హాల్ట్ ఉంటుంది. 08331 నంబరు గల రైలు ఈనెల 7, 15, 17న 00.15 గంటలకు (ఆయా తేదీల ముందురోజు అర్ధరాత్రి 12.15) పలాసలో బయలుదేరి ఉదయం 5.35 గంటలకు పూరి చేరుతుంది. తిరిగి ఈనెల 8, 16, 18న ఉదయం 4.00 గంటలకు పూరిలో బయలుదేరి 10.05 గంటలకు పలాస చేరుతుంది. ఈ రైళ్లకు మార్గంలోని అన్ని స్టేషన్లలో హాల్ట్ ఉంటుంది. 08349 నంబరు గల రైలు ఈనెల 6, 14, 16న ఉదయం 10. 45 గంటలకు జగదల్‌పూర్‌లో బయలుదేరి అర్ధరాత్రి 12.45 గంటలకు పూరి చేరుతుంది. తిరిగి ఈ రైలు 8, 16,18న 00.15 గంటలకు పూరిలో బయలుదేరి మధ్యాహ్నం 3.10 గంటలకు జగదల్‌పూర్ చేరుతుంది.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	110.00
లైవ్ ధర	130.00
విత్ స్కిన్	230.00
స్కిన్ లెస్	240.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	545
విజయనగరం	549
శ్రీకాకుళం	549

కృష్ణాదేవిపేటలో అల్లూరి జయంతికి ముమ్మర ఏర్పాట్లు

» నర్సీపట్నం ఆర్డీవో హెచ్‌వీ జయరాం


అధికారులతో మాట్లాడుతున్న ఆర్‌డీవో జయరాం

కృష్ణాదేవిపేట, జూలై 2: విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు 127వ జయంతిని కృష్ణాదేవిపేట అల్లూరి స్మృతివనం వద్ద ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు నర్సీపట్నం డివిజనల్ రెవెన్యూ అధికారి హెచ్‌వీ జయరాం తెలిపారు. మంగళవారం ఆర్డీవో జయరాం గొలుగొండ మండల స్థాయి అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కృష్ణాదేవిపేట అల్లూరి పార్కులో జయంతికి చేపట్టాల్సిన పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా పార్కును పరిశీలించి పార్కు ముఖద్వారం, విగ్రహాలు, ఆవరణలో రంగులు, ముగ్గులు వేయించాలని ఆదేశించారు. అలాగే అల్లూరి జయంతి రోజున నాలుగు మండలాల నుంచి విద్యార్థులు అల్లూరి వేషధారణ, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామన్నారు. కృష్ణాదేవిపేట రామాలయం నుంచి విద్యార్థులతో ప్రారంభకానున్న భారీ ర్యాలీకి తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అల్లూరి పార్కులో ఈ నెల 4న జయంతి కార్యక్రమానికి రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, గాజువాక ఎమ్మెల్యే, రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్‌తో పాటు ఇతర ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఆహ్వానం పలుకుతున్నట్లు తెలిపారు. వీరందరి రాకకు అనుకూలంగా సభా వేదిక, పరిసరాలు పరిశుభ్రత, భద్రత వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో గొలుగొండ మాజీ జడ్పీటీసీ చిటికెల తారకవేణుగోపాల్, జిల్లా ట్రైబుల్ వెల్ఫేర్ అధికారి వి.నాగశిరీష, నర్సీపట్నం రూరల్ సీఐ బి.హరి, కృష్ణాదేవిపేట రేంజర్ సుంకర వెంకటరావు, కృష్ణాదేవిపేట ఎస్ఐ ఎం.ఉపేంద్ర, ఈవోపీఆర్‌డీ రమాదేవి, డిప్యూటీ తహసీల్దార్ రాజ్‌భరత్, పలు శాఖలు జేఈఈలు అరుణకుమారి, రాజేంద్రప్రసాద్, సుదీసన, ఆర్ఐలు నాగరాజు, నారాయణరావు, కొడబాబు, కార్యదర్శిలు శ్రీనివాస్, రఘు, రాజేష్, టీడీపీ నాయకులు బొడ్డు జమీలు, పెట్ల నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రాంకీ, ఫార్మా యాజమాన్యాలపై చర్యలు చేపట్టాలి

» మా జీవనోపాధి దెబ్బ తీస్తున్నారు

» ఎస్పీకి ముత్యాలమ్మపాలెం గ్రామస్థుల వినతి


జిల్లా ఎస్పీ మురళీకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న ముత్యాలమ్మపాలెం మత్స్యకారులు

పరవాడ, జూలై 2: ఫార్మా వ్యర్థ రసాయనాలను నేరుగా సముద్రంలోకి విడిచిపెట్టి మత్స్యసంపద మృతికి కారణమవుతున్న రాంకీ, ఫార్మా పరిశ్రమల యాజమాన్యాలపై తగు చర్యలు చేపట్టాలని ముత్యాలమ్మపాలెం గ్రామస్థులు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. కొన్ని దశాబ్దాలుగా ముత్యాలమ్మపాలెం గ్రామానికి చెందిన మత్స్యకారులంతా సముద్ర వేటపై ఆధారపడి జీవిస్తున్నారని, ఫార్మా పరిశ్రమల స్థాపన తరువాత యాజమాన్యాలు వ్యర్థ రసాయనాలను సముద్రంలోకి విడిచిపెట్టడంతో చేపలు మృత్యువాత పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తమ జీవనోపాధి దెబ్బతిందన్నారు. ఇటీవల ముత్యాలమ్మపాలెం ఉప్పుటేరులో ఫార్మా వ్యర్థజలాలు కలవడంతో భారీ ఎత్తున చేపలు మృతి చెందినట్లు తెలిపారు. అలాగే రాంకీ యాజమాన్యం ఫార్మాసిటీ నుంచి తిక్కవానిపాలెం తీరం వరకు వ్యర్థ జలాల పైపులైన్ ఏర్పాటు చేసిందని వ్యర్థ జలాలను శుద్ధి చేయకుండా నేరుగా పైపులైన్ ద్వారా సముద్రంలోకి విడిచిపెట్టడంతో చేపలు మృత్యువాత పడుతున్నాయని తెలిపారు. ఈ విషయమై 2012లో ఆమరణ నిరాహరదీక్ష చేయడంతో అప్పటి జిల్లా కలెక్టర్ స్పందించి రాంకీ యాజమాన్యంతో చర్చలు నిర్వహించినట్లు తెలిపారు. చర్చల్లో భాగంగా 500 మంది మత్స్యకారులకు శాశ్వత ఉపాధి కల్పిస్తామని ఫ్యాక్టరీ యాజమాన్యం అగ్రిమెంట్ కూడా చేసినట్టు వెల్లడించారు. అయితే 12 ఏళ్లు గడుస్తున్నా నేటికీ ఉపాధి కల్పించలేదని వాపోయారు. దీనిపై తక్షణమే కలగజేసుకుని మత్స్యకారులకు న్యాయం చేయాలని కోరారు. అలాగే కలెక్టరేట్‌లోని అడ్మినిస్ట్రేటివ్ అధికారి శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతకాయల ముత్యాలు, మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు మైలపల్లి అప్పన్న, ఎంపీటీసీ మాజీ సభ్యుడు చింతకాయల అమ్మోరు, మత్స్యకార నాయకులు అర్జిల్లి రవి, సూరాడ ముత్యాలరావు, సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌డీఏ కార్యాలయం ఎదుట డ్వాక్రా మహిళల ధర్నా

» డ్వాక్రా నిధులు కాజేసిన అధికారులపై చర్యలకు డిమాండ్


డీఆర్‌డీఏ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న డ్వాక్రా మహిళలు

అనకాపల్లి టౌన్, జూలై 2: డ్వాక్రా మహిళల నిధులు కాజేసిన అధికారులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం స్థానిక డీఆర్‌డీఏ కార్యాలయం ఎదుట డ్వాక్రా మహిళలు ధర్నా చేశారు. మండలంలోని సత్యనారాయణపురం, కొత్తూరు, మూలపేట పంచాయతీల్లో నకిలీ డ్వాక్రా గ్రూపులను ఏర్పాటు చేసి బ్యాంకు రుణాలను కాజేసిన వెలుగు, బ్యాంకు సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. సీపీఎం, ఐద్వా ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నాలో సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడుతూ సంఘటన జరిగి ఆరు నెలలు అయిందని, అయినప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించి ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఎనిమిది కోట్ల రూపాయలు అవినీతికి పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. దోషులను కఠినంగా శిక్షించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. సీపీఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ మాట్లాడుతూ సత్యనారాయణపురం, కొత్తూరు పంచాయతీల్లో వీవోఏ గ్రూపు సభ్యులకు తెలియకుండానే నకిలీ గ్రూపులను ఏర్పాటు చేసి రూ.ఎనిమిది కోట్ల రూపాయలకు అవినీతికి పాల్పడ్డారన్నారు. ఐద్వా జిల్లా కార్యదర్శి డీడీ వరలక్ష్మి మాట్లాడుతూ ఇంత పెద్ద అవినీతి వ్యవహారం జరుగుతున్నా దీనిని పర్యవేక్షించాల్సిన మండల ఏపీఎం, సీసీలు సిబ్బందిని సస్పెండ్ చేసి చేతులు దులుపుకుందని ఆరోపించారు. ఈ ధర్నాలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రుత్తల శంకరరావు, డ్వాక్రా మహిళలు జి. సుభాషిణి, నాగమణి, ఉప్పాక లక్ష్మి, బోడి ఝాన్సీ, బొబ్బిలి గాయిత్రి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాలు

» కొన్నెంపూడిలో ఐదుగురికి జ్వరాలు


కొన్నెంపూడిలో రోగులను తనిఖీ చేస్తున్న హెల్త్ అసిస్టెంట్ పేరునాయుడు


చీడికాడ, జూలై 2: మండలంలోని కొన్నెంపూడి, కోనాం గ్రామాల్లో రెండు రోజులుగా చీడికాడ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నారు. సోమవారం కొన్నెంపూడి గిరిజన గ్రా మంలో 18 మందికి హెల్త్‌అసిస్టెంట్ పెంటకోట పేరునాయుడు తనిఖీచేయగా, కాదరి దేముడు, బోలం గీత, కోట కొండబాబు, పాడి హర్షవర్దన్, బొర్రబోయిన దుర్గ ఐదుగురు జ్వరంతో బాధపడుతున్నట్టు గుర్తించారు. వీరందరికీ రక్తపరీక్షలు చేసి మందులు పంపిణీచేశారు. ఈ శిబి రంలో హెల్త్ సూపర్‌వైజర్ జి. వెంకటరావు, ఆశవర్కర్లు పాల్గొన్నారు. మంగళవారం కోనాంలో ఫ్యామిలీఫిజీషియన్‌లో భాగంగా వైద్య శిబిరం జరిగింది. 35మందికి తనిఖీలు చేసి మందులు అందించారు. ఈ శిబిరంలో చీడికాడ పీహెచ్‌సీ వైద్యాధికారి సునీల్‌కుమార్, వైద్య సిబ్బంది పేరునాయుడు, మొల్లి వరలక్ష్మి, రాజేశ్వరి సేవలందించారు.

జూ పార్కుకు కొత్త అతిథులు

» నేడు గుజరాత్ నుంచి రాక

ఎంవీపీ కాలనీ/ఆరిలోవ, జూలై 2: నగరంలోని ఇందిరాగాంధీ జంతు ప్రదర్శన శాల, గుజరాత్‌లోని జామ్‌నగర్ గ్రీన్స్ జూలాజికల్ రెస్క్యూ అండ్ రిహాబిలిటేషన్ సెంటర్ మధ్య జంతు మార్పిడి పథకం ద్వారా కొత్త ప్రాణులను విశాఖ తీసుకురానున్నారు. జూ క్యూరేటర్ మంగమ్మ తెలిపిన వివరాల ప్రకారం... గుజరాత్‌లోని రాధే కృష్ణ టెంపుల్ ఎలిఫెంట్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విశాఖ జూ పార్కుకు ఆకుపచ్చ రెక్కల మకావ్, స్కార్లెట్ మకావ్, మిలిటరీ మకావ్, మీడియం సల్ఫర్ కకాటూ, స్లెండర్ టెయిల్డ్ మీర్కట్, రెడ్ నేక్డ్ వల్లబీ, స్క్విరల్ మంకీ రానున్నాయి. వీటికి బదులు ఇక్కడి నుంచి హైనా, హాగ్ డీర్, పెయింటెడ్ స్టార్క్, గ్రె పెలికాన్, స్టార్ టార్టాయిస్, ఘరీయల్, జంగిల్ క్యాట్, ధోలే, తోడేలు, గౌర్ వంటి 49 రకాల పక్షులు, ఇతర జంతువులను అందిస్తున్నారు. బుధవారం విశాఖ రానున్న ప్రాణులను కొద్దిరోజుల పాటు క్వారంటైన్‌లో ఉంచి, పరీక్షించిన అనంతరం సందర్శకులు వీక్షించేందుకు వీలుగా ఎన్‌క్లోజర్లలో ఉంచుతామని క్యూరేటర్ తెలిపారు.

ఉపాధ్యాయుల శిక్షణ శిబిరాన్ని సందర్శించిన డీఈవో


శిబిరంలో మాట్లాడుతున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

చోడవరం, జూలై 2: స్థానిక జెడ్పీబాలికల హైస్కూల్‌లో చోడవరం, మాడుగుల, పెందుర్తి నియోజకవర్గాలకు చెందిన ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న టీచ్‌టు టూల్ శిక్షణ శిబిరాన్ని మంగళవారం డీఈవో వెంకటలక్ష్మమ్మ సందర్శించారు. శిబిరంలో శిక్షణతీరును ఆమె పరిశీలించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు జయలక్ష్మి, సింహాచలం, సమగ్రశిక్ష అధికారులు పాల్గొన్నారు.

శకుంతలాదేవి గణిత క్లబ్ అధ్యక్షునిగా దుర్గాప్రసాద్

కశింకోట, జూలై 2 : శకుంతలాదేవి గణిత క్లబ్ అధ్యక్షుడిగా పాలా దుర్గాప్రసాద్ నియమితులయ్యారని వెదురుపర్తి జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం జీవీకే.ఆచారి తెలిపారు. మంగళవారం స్థానిక పాఠశాలలో జరిగిన నూతన కార్యవర్గం నియమించి క్లబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యదర్శిగా పావని పరమేశ్వరి మరో ఆరుగురు సభ్యులను నియమించామన్నారు. ఈ కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు ఏవీఎస్.మూర్తి, పి.సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

కొత్త చట్టాలపై అవగాహన చేసుకోవాలి

కశింకోట,జూలై 2: కొత్త చట్టాలపై ప్రజలంతా అవగాహన పెంపొందించుకోవాలని కశింకోట ఏఎస్ఐ కణితి రమణి అన్నారు. మంగళవారం కశింకోటలోని పలు పురవీధుల్లో ప్రజలకు ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన చట్టాలపై ఆమె అవగాహన కల్పించారు. గతంలో ఇండియన్ పీనల్ కోడ్‌లో 511 చట్టాలు ఉండేవని, వాటిని తాజాగా భారతీయ న్యాయ సన్హిహిత చట్టం కింద 358 చట్టాలుగా రూపకల్పన చేశారని వివరించారు. ప్రజలు, మహిళలకు ఎటువంటి అన్యాయం జరిగినా శిక్షలు వెంటనే అమలు చేసే విధంగా చట్టాలు రూపొందించారని తెలిపారు. పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు వచ్చినా వెంటనే బాధితులకు న్యాయం జరుగుతుందని, తప్పు చేసిన వారు చట్టం నుంచి తప్పించుకునే అవకాశం లేదన్నారు.

సమష్టి కృషితోనే కూటమి విజయం

» టీడీపీ మండల అధ్యక్షుడు అబద్దం

ఎస్.రాయవరం, జూలై 2 : గ్రామ స్థాయి నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, శ్రేణులంతా కష్టపడి పనిచేయడం వల్లే పాయకరావుపేట నియోజకవర్గంలో వంగలపూడి అనిత అత్యధిక మెజారిటీతో విజయం సాధించారని టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్దం పేర్కొన్నారు. సోమవారం రాత్రి ధర్మవరం అగ్రహారంలో టీడీపీ మండల యూత్ అధ్యక్షుడు సుంకర శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అబద్దంతో పాటు టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి అల్లు నరసింహమూర్తి, సీనియర్ నాయకులు గుర్రం రామకృష్ణ, పల్లెల జగ్గారావులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ కలిగట్ల మాణిక్యం, నాయకులు సియ్యాదుల అచ్యుత్‌కుమార్, బండి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అచ్చెర్లలో ఘనంగా తుంపాలమ్మ తల్లి పండగ

» దర్శించుకున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ


తుంపాలమ్మతల్లిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

కశింకోట, జూలై 2: మండలంలోని అచ్చెర్ల గ్రామంలో తుంపాలమ్మతల్లి పండగ మంగళవారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం నుంచి భక్తులు ఆలయానికి తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. చుట్టు పక్కల పరిసరాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఎంపీటీసీ మాజీ సభ్యుడు దొడ్డి నాగేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ నాయకులు నైనంశెట్టి రమణారావు తదితరులు స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలోని ప్రత్యేక పూజలు చేశారు. కాగా మధ్యాహ్నం భక్తులు అమ్మవారి ఘటాలను ఊరేగింపుగా తీసుకువెళ్ళారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో పలు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉత్సవ కమిటీ ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు కర్రి సత్యనారాయణ, నిమ్మదల సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

మోదకొండమ్మకు వెండి విష్ణుచక్రం బహూకరణ


అమ్మవారికి బహూకరించిన వెండి విష్ణుచక్రం

మాడుగుల రూరల్, జూలై 2: మండలంలోని ఎం.కోడూరులోని మోదకొండమ్మ అమ్మవారికి మంగళవారం దాతలు కిలో 250 గ్రాముల వెండి విష్ణు చక్రం ఆభరణాన్ని బహూకరించారు. గ్రామానికి చెందిన పడాల అప్పలనరసయ్య, కాత్రకోట పద్మ, రాజకుమార్ తయారు చేయించి ఇచ్చిన విష్ణుచక్రాన్ని అమ్మవారికి అలంకరించినట్టు సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావు తెలిపారు.

విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలి

పాయకరావుపేట, జూలై 2: ఈ ఏడాది నిర్వహించిన నీట్‌తో పాటు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం దేశవ్యాప్తంగా జరిగే కేజీ టు పీజీ విద్యా సంస్థల బంద్‌ను విజయవంతంచేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.జగదీశ్, జిల్లా కార్యదర్శి ఎం.రమణ పిలుపునిచ్చారు. నీట్ పరీక్ష పేపర్ లీక్ అయిందని, దీనిలో దోషులుగా ఉన్నవారు ఒక్కో విద్యార్థి నుంచి రూ.30 నుంచి రూ.40 లక్షలు వసూలు చేశామని చెబుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం నీట్ పరీక్షను రద్దు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. పేపర్ లీక్‌కు బాధ్యులైన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని, నీట్ పరీక్షను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా చేయతలపెట్టిన విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ డివిజన్ నాయకులు ఏసు, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

విష జ్వరాలను అదుపు చేయాలి

» జిల్లా కలెక్టర్‌ను కోరిన సీపీఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

అనకాపల్లి టౌన్, జూలై 2: జిల్లాలో విజృంభిస్తున్న విషజ్వరాలు అదుపు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి లోకనాథం జిల్లా కలెక్టర్‌ను ఒక లేఖలో కోరారు. జిల్లాలో ప్రధానంగా గొలుగొండ, నాతవరం, రోలుగుంట, రావికమతం, వి.మాడుగుల మండలాల్లోని ఏజెన్సీకి ఆనుకుని ఉన్న గ్రామాల్లో జ్వరాలు ఎక్కువగా ఉన్నాయని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో పారిశుధ్య సమస్యలు వెంటాడుతున్నాయన్నారు. దీనివల్ల దోమలు విపరీతంగా పెరుగుతున్నాయన్నారు. పంచాయతీల్లో నిధులు కొరత మూలంగా బ్లీచింగ్ పొడరు, దోమల నివారణకు ఫాగింగ్ చేయడం లేదన్నారు. పారిశుధ్య కార్మికులు కొరత కూడా ఉందన్నారు. దీని వల్ల పంచాయతీల్లో పారిశుధ్యం అధ్వానంగా మారిందన్నారు. జ్వరాలు ప్రబలుతున్న గ్రామాలను గుర్తించి ఉచిత వైద్యశిబిరాలను నిర్వహించాలని జిల్లా కలెక్టర్‌ను కోరినట్లు లోకనాథం తెలిపారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్‌సెంటర్లల్లో మలేరియా పరీక్షా కిట్లు, అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చూడాలని కోరినట్లు తెలిపారు.

డిగ్రీలో ప్రవేశాలకు 10వ వరకూ గడువు

నక్కపల్లి, జూలై 2: నక్కపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యాసంవత్సరంలో డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 10లోగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. నక్కపల్లి డిగ్రీ కళాశాలలో బీఏ ఆనర్స్ (హిస్టరీ), బీకాం ఆనర్స్ (కంప్యూటర్ అప్లికేషన్స్), బీఎస్సీ ఆనర్స్ (బాటనీ), బీఎస్సీ మ్యాథ్స్, బీఎస్సీ కెమిస్ట్రీ, కోర్సులకు అడ్మిషన్లు జరుగుతున్నాయని తెలిపారు. అన్ని కోర్సులకు కంప్యూటర్ సైన్స్, అప్లికేషన్స్ మైనర్ సబ్జెక్టులుగా ఉంటాయని తెలిపారు. విద్యార్థులకు ఉపకార వేతనాలతో పాటు, ఫీజు రీ-ఎంబర్స్‌మెంట్ వంటి పథకాలు వర్తిస్తాయని పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం నక్కపల్లి డిగ్రీ కళాశాల కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

'ఆశ్రమాల్లో అక్రమ డిప్యూటేషన్లు రద్దు చేయాలి'



సమావేశంలో మాట్లాడుతున్న రాధాకృష్ణ

పాడేరురూరల్, జూలై 2: జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలు, మినీ గురుకులాలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో కొనసాగుతున్న అక్రమ డిప్యూటేషన్లను తక్షణమే రద్దు చేయాలని గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కె.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ..ఆశ్రమ పాఠశాలల్లో డిప్యూటీ వార్డెన్, ప్రిన్సిపాల్‌గా రాజకీయ ఒత్తిడ్లతో వేయించుకున్న డిప్యూటేషన్లను రద్దు చేసి, ఆ ఉపాధ్యాయులను వెనక్కి పంపించాలన్నారు. డిప్యూటేషన్లపై వెళ్లిన కొంతమంది ఉపాధ్యాయులు వసతిగృహాల నిర్వహణను వ్యాపార సంస్థలుగా మారుస్తున్న పరిస్థితులు అధికంగా ఉన్నాయని ఆరోపించారు. ఈ కారణంగా ఆశ్రమాల్లో విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందక వ్యాధులకు గురవుతూ, మృత్యువాత పడుతున్న ఘటనలు లేకపోలేదన్నారు. విద్యారంగంలో అక్రమ డిప్యూటేషన్లను రద్దు చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాజు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

వాహన చోదకులకు డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి : సీఐ

చింతపల్లి, జూలై 2: వాహన చోదకులు విధిగా డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.రమేశ్ తెలిపారు. మంగళవారం డిగ్రీ కళాశాల, హనుమాన్ జంక్షన్‌లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వాహన చోదకులతో మాట్లాడుతూ.. వాహనాలు నడిపే ప్రతి వ్యక్తి డ్రైవింగ్ లైసెన్సు, వాహనానికి సంబంధించిన ఇన్సురెన్సు, సీబుక్, పొల్యూషన్ ధ్రువపత్రాలు కలిగి ఉండాలన్నారు. డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం, అతివేగంతో ప్రయాణించడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అలాగే ప్రైవేటు సర్వీసు వాహనాలు పరిమితికి మించి ప్రయాణించరాదన్నారు. ఆటోలు, జీపులు నడిపే డ్రైవర్లు బ్యాడ్జీ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ఈకార్యక్రమంలో సబ్ ఇన్‌స్పెక్టర్ అరుణ్ కిరణ్ పాల్గొన్నారు.

అల్లూరి జయంతిని పురస్కరించుకొని వ్యాసరచన పోటీలు

పాడేరురూరల్, జూలై 2: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకొని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో విద్యార్థులకు ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం వ్యాసరచనపోటీలు నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ పీవోలు దామోదర్, గణేష్ ముందుగా అల్లూరి సీతారామరాజు జీవిత చరిత్రపై అవగాహన కల్పించారు. అనంతరం వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభను కనపరిచిన విద్యార్థులకు ఈనెల 4వ తేదీన ప్రిన్సిపాల్ చిట్టబ్బాయి బహుమతులు అందజేస్తారని ఎన్ఎస్ఎస్ పీవో జి.గౌరీశంకరరావు తెలిపారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఎండీఎం నిర్వాహకులు విధిగా మెనూ పాటించాలి'


కొత్తపాకలు పాఠశాలలో విద్యార్థుల విద్యా ప్రగతిని పరిశీలిస్తున్న తహసీల్దార్ రామకృష్ణ

చింతపల్లి, జూలై 2: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు మెనూను విధిగా పాటించాలని స్థానిక తహసీల్దార్ టి. రామకృష్ణ అన్నారు. మంగళవారం కొత్తపాకలు, చినకొత్తూరు ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించారు. తొలుత విద్యార్థుల విద్యా ప్రగతి, మధ్యాహ్న భోజనాలను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు, ఉపాధ్యాయులతో తహసీల్దార్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు రుచికరమైన, నాణ్యమైన భోజనాలు పెట్టాలన్నారు. భోజనాలను ప్రతి రోజు ఉపాధ్యాయులు పరిశీలించాలన్నారు. అలాగే విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలన్నారు. కనీస సామర్థ్యాలు తెలుగు, ఆంగ్లం, గణితంపై విద్యార్థులు పట్టు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.

అరకు కాఫీ ఘుమఘుమలు

... 5వ పేజీ తరువాయి

కిలో రూ.50కు కొనుగోలు చేస్తుండగా, ఇద్దరు వ్యక్తులు నాలుగు రోజులు శ్రమించి పార్చిమెంట్ చేస్తే కిలోకు రూ.280 మాత్రమే వస్తుంది. కిలోకు రూ.20 నష్టంతో పాటు ఇద్దరు వ్యక్తుల నాలుగు రోజులు కష్టం సైతం పోతుంది. అందుకే గిరిజన రైతులు కాఫీ పండ్లను విక్రయంపైనే ఆసక్తి చూపుతున్నారు.

లభించని సరైన ధర

మన్యంలో కాఫీ ప్రస్తావన వచ్చే ప్రతిసారి అధికారులు, ప్రజా ప్రతినిధులు గిరిజన కాఫీ రైతులకు మంచి ధరలు అందిస్తామని ప్రకటిస్తుంటారు. కానీ వాస్తవానికి ఆ దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఏజెన్సీలో గిరిజన రైతుల నుంచి కాఫీ పండ్లను చింతపల్లిలోని మాక్స్ సొసైటీతోపాటు, పలు స్వచ్ఛంద సంస్థలకు చెందిన సొసైటీలు కొనుగోలు చేస్తుంటాయి. పార్చిమెంట్ (కాఫీ పప్పు), చెర్రీ (తొక్క తీసిన గింజలు)లను గిరిజన సహకార సంస్థ, ప్రైవేటు వర్తకులు మాత్రమే కొనుగోలు చేస్తుంటారు. జీసీసీ ద్వారా కిలో పార్చిమెంట్ రూ.280, చెర్రీ కిలో రూ.145కు మాత్రమే కొనుగోలు చేశారు. వాస్తవానికి బెంగళూరులో పార్చిమెంట్ కిలో రూ.370 ఉంది. ఇక అంతర్జాతీయ స్థాయిలో అయితే కిలో పార్చిమెంట్ రూ.470 పైబడి ధర ఉంటుంది. ఈ లెక్కన చూస్తే గిరిజన రైతులకు సరైన ధర లభించడం లేదనే చెప్పాలి. ఇప్పటికైనా అధికారులు సరైన ఆలోచనలో కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి గిరిజన కాఫీ రైతులకు సరైన ధర లభించేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

దూరవిద్యలోనూ ఇష్టారాజ్యం

... 5వ పేజీ తరువాయి

కొన్ని కాలేజీల యాజమాన్యాలు యత్నిస్తున్నాయి.

స్టడీ సెంటర్లకు ఎగనామం

ప్రతి అవసరానికి ఏయూలోని దూర విద్యా కేంద్రానికి రావడం విద్యార్థులకు ఇబ్బంది అవుతుంది. దీనిని దృష్టి ఉంచుకుని దూర విద్యా కేంద్రం ఆధ్వర్యంలో గతంలో ఇటు శ్రీకాకుళం జిల్లా నుంచి అటు గుంటూరు జిల్లా వరకు పది స్టడీ సెంటర్లను ఏర్పాటుచేశారు. ఈ స్టడీ సెంటర్లలో విద్యార్థులకు అవసరమైన సేవలు అందించేలా సిబ్బందిని నియమించారు. అడ్మిషన్ ఇవ్వడం దగ్గర నుంచి ఫీజులు వసూలు, పుస్తకాల పంపిణీ వంటి సేవలను అందించేవారు. అయితే, ఆన్‌లైన్‌లో సేవలు అందిస్తున్నామని చెప్పి ఈ స్టడీ సెంటర్లను అధికారులు పూర్తిగా ఎత్తేశారు.

దశలవారీగా సమస్యల పరిష్కారం

... 5వ పేజీ తరువాయి


కలెక్టర్‌కి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సర్పంచ్ దంపతులు

చేశారు. రూ.12 కోట్లతో నిర్మిస్తున్న రహదారి పనులను తనిఖీ చేశారు. బూసిపుట్టు జంక్షన్ నుంచి పిట్టలబొర్రా జలపాతం వరకు ఉపాధి నిధులతో రూ.12 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించిన రహదారి పనులు పరిశీలించారు. పిట్టలబొర్రా జంక్షన్ నుంచి గిన్నెలకోట వరకు కోట్ల వ్యయంతో చేపడుతున్న రహదారి పనులను తనిఖీ చేశారు. రూ.1.4 కోట్ల వ్యయంతో చేపట్టిన గిన్నెకోట వంతెన పనులు నిధులు లేక నిలిచిపోవడంతో వేరే గ్రాంటు నుంచి నిధులు మంజూరు చేస్తామని, అవసరమైన ప్రతిపాదనలు సమర్పించాలని గిరిజన సంక్షేమ శాఖ ఈఈని ఆదేశించారు. జామిగూడ వంతెన నిర్మాణానికి నిధులు లేకపోవడంతో పనులు ప్రారంభించలేదని, ఆ వంతెన నిర్మాణానికి వేరే గ్రాంటు నుంచి నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. గిన్నెలకోటలో పలువురికి ఆధార్ కార్డులు లేదని గ్రామస్థులు చెప్పడంతో మొబైల్ ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్ల జారీకి అవసరమైన చర్యలు చేపడతామని చెప్పారు. అంతకు ముందు రూఢకోట పీహెచ్‌సీని సందర్శించారు. ఆస్పత్రి రికార్డులు సక్రమంగా నిర్వహించలేదని వైద్య సిబ్బదిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జామిగూడ వంతెన నిర్మాణ పనులు ప్రారంభించాలని మాజీ ఎంపీపీ జర్సింగి బాలంనాయుడు.. కలెక్టర్‌ను కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. ఆయన వెంట గిరిజన సంక్షేమ శాఖ ఈఈ కె.వేణుగోపాలరావు, పంచాయతీరాజ్ డీఈ రవికుమార్, ఎంపీడీవో పూర్ణయ్య, తహసీల్దార్ విగ్గిమ్స్, ముంచంగిపుట్టు ఎంపీడీవో కిరణ్‌కుమార్, గిరిజన సంక్షేమ శాఖ ఏఈలు రాము, ధ్రువకుమార్ ప్రజా ప్రతినిధులు, తదితరులు ఉన్నారు.


జామిగూడలో పర్యటిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

ఎంత నిర్లక్ష్యం..

- ధారాలమ్మ ఘాట్‌లో చెట్టు పడి నాలుగు రోజులైనా తీయలేదు..
- ఆర్‌అండ్‌బీ శాఖ అధికారుల తీరుపై ఆగ్రహం
- అవస్థలు పడుతున్న వాహన చోదకులు


ధారాలమ్మ ఘాట్ రోడ్డులో గాలివానకు రహదారిపై కూలిన చెట్టు

సీలేరు, జూలై 2 : జీకేవీధి మండలం ధారకొండ ఘాట్ రోడ్డులో నాలుగు రోజులు క్రితం పడిపోయిన భారీ చెట్టును సంబంధిత అధికారులు తొలగించకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ చెట్టు తొలగించకపోవడంతో వాహనదార్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ధారాలమ్మ ఆలయం దిగువన రెండవ మలుపు వద్ద జూన్ 29వ తేదీన కురిసిన గాలి వానకు భారీ చెట్టు రోడ్డుకడ్డంగా పడిపోయింది. దీంతో వచ్చే పోయే వాహనాలు రహదారి పక్క నుంచి వెళుతున్నాయి. అయితే వర్షం కురిస్తే భారీ వాహనాలు బురదలో కూరుకుపోతాయోనని డ్రైవర్లు భయాందోళన చెందుతున్నారు. అయితే నాలుగు రోజులు అయినా ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు రోడ్డుపై పడిన చెట్టును తొలగించకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అసలే ఘాట్ రోడ్డు ఇరుకుగా ఉంటుందని, దీనికి తోడు వర్షం ఎప్పుడు కురుస్తుందో తెలియని పరిస్థితి ఉందని వారంటున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో అధికారుల నిర్లక్ష్యంపై వాహనదార్లు, స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ధారాలమ్మ ఘాట్ రోడ్డులో పడిపోయిన చెట్టును తొలగించాలని కోరుతున్నారు.

మలేరియా నివారణకు చర్యలు చేపట్టాలి

- గిరిజన సంఘం ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర


అరకులోయ ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న గిరిజన సంఘం ప్రతినిధులు

అరకులోయ, జూలై 2: ఎపిడమిక్ సీజన్‌లో ప్రబలుతున్న ప్రాణాంతక వ్యాధుల నివారణకు వైద్యఆరోగ్య శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టాలని గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు. మంగళవారం అరకులోయ ఆస్పత్రిని గిరిజన సంఘం నేతలు సురేంద్ర, బాలదేవ్, రామారావు సందర్శించి, వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులను చికిత్స అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ.. అరకులోయ ఆస్పత్రికి గ్రామాల నుంచి అధికంగా మలేరియా బాధితులు వస్తున్నారని, జూన్ నెలలో 58 మందికి మలేరియా నిర్ధారణ అయ్యిందన్నారు. వర్షాలు కురుస్తుండడంతో దోమలు వ్యాప్తి చెంది మలేరియా వంటి ప్రాణాంతక వ్యాధుల బారిన ప్రజలు పడుతున్నారన్నారు. ఎపిడిమిక్ సీజన్‌లో గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి తక్షణ వైద్య సేవలు అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అరకులోయ పట్టణంలో దోమల నివారణకు స్ప్రేయింగ్‌ను విస్తృతంగా చేయాలని డిమాండ్ చేశారు. ఆస్పత్రిలో రోగులకు వండి పెట్టెవారికి గత ఆరు నెలల నుంచి డైట్ బిల్లు రావడం లేదని, ఇలా డైట్ బిల్లు చెల్లించకపోతే నిర్వాహకులపై ఆర్థిక భారం పడుతుందన్నారు. తక్షణం ఆరు నెలల డైట్ బకాయి బిల్లులు చెల్లించాలని గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కిల్లో సురేంద్ర, అల్లూరి జిల్లా సీపీఎం ఉపాధ్యక్షుడు పొద్దు బాలదేవ్, మండల కార్యదర్శి కిండంగా రామారావు డిమాండ్ చేశారు.

జీకే వీధి బాలికల గురుకుల కళాశాలలో నిలిచిన విద్యాబోధన

ఉపాధ్యాయులకు మద్దతుగా అమరావతి వెళ్లిన అవుట్ సోర్సింగ్ అధ్యాపకులు

గూడెంకొత్తవీధి, జూలై 2: స్థానిక ఏపీ గిరిజన సంక్షేమ శాఖ బాలికల గురుకుల కళాశాలలో రెండు రోజులుగా విద్యాబోధన నిలిచిపోయింది. కళాశాలలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ అధ్యాపకులు ధర్నా చేపట్టేందుకు అమరావతి వెళ్లిపోయారు. దీంతో కళాశాలలో ప్రిన్సిపాల్ ఒక్కరే ఉన్నారు. తరగతులు జరగకపోవడంతో విద్యార్థినులు ఇబ్బంది పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీలో ఏపీ గిరిజన సంక్షేమ శాఖ గురుకుల పాఠశాల ఉపాధ్యాయుల పోస్టులను సైతం భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసింది. డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయులు భర్తీ జరిగితే అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఉపాధి కోల్పోతారని, ధర్నా చేపట్టేందుకు గతనెల 29న ప్రిన్సిపాళ్లకు సమ్మె నోటీసు ఇచ్చారు. ఈనెల ఒకటో తేదీన అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు ఉన్నతాధికారుల కలిసేందుకు అమరావతి వెళ్లారు. వీరికి మద్దతుగా కళాశాలల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ అధ్యాపకులు సైతం విధులను బహిష్కరించి అమరావతి వెళ్లారు. ఈకారణంగా కళాశాల్లో విద్యాబోధన నిలిచిపోయింది. ప్రిన్సిపాల్ విద్యార్థినులు చదువుకోవాలని సూచించి, పర్యవేక్షణ చేస్తున్నారు.

'స్టాప్ డయేరియా'పై అవగాహన ర్యాలీలు


జీకేవీధిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, వైద్య సిబ్బంది

గూడెంకొత్తవీధి, జూలై 2: గిరిజనులు అతిసారపై అప్రమత్తంగా ఉండాలని పెదవలస వైద్యాధికారి కోమలి అన్నారు. మంగళవారం పెదవలస పంచాయతీ కేంద్రంలో 'స్టాప్ డయేరియా' కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి కోమలి మాట్లాడుతూ ఈనెల ఒకటో తేదీ నుంచి నెలాఖరు వరకు స్టాప్ డయేరియా కార్యక్రమం నిర్వహిస్తూ ప్రజలను చైతన్యవంతులను చేయడం జరుగుతుందన్నారు. చిన్నపిల్లలు, పెద్దల్లో అతిసార లక్షణాలు కనిపించిన వెంటనే ఆస్పత్రికి వచ్చి చికిత్స పొందాలన్నారు. ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు గృహాలను సందర్శించి ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తారన్నారు. అలాగే 14రోజుల పాటు ప్రతి బిడ్డకు జింక్ మాత్రలు అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి పృథ్వీష, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసరావు, ఈవో బాలరాజు, హెచ్‌వీ దేవమణి పాల్గొన్నారు.

హుకుంపేటలో.. డెంగ్యూ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని హుకుంపేట పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ శాంతి పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో డెంగ్యూ వ్యాధిపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా పెట్రోల్ బంక్ వద్ద మానవహారంగా ఏర్పడి డెంగ్యూకు నివారణే ఉత్తమ రక్షణ అని నినాదాలు చేశారు. అనంతరం పీహెచ్‌సీలో నిర్వహించిన సమావేశంలో డాక్టర్ శాంతి మాట్లాడుతూ.. ప్రతీ వ్యక్తి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పారిశుధ్య లోపం లేకుండా చూసుకోవాలన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్లు, డ్రైనేజీలు శుభ్రం చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మండలంలోని సూకురు గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో మంగళవారం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శాంతి విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌వో మహేష్ పీహెచ్ఎన్ జమ్మి, హెల్త్ అసిస్టెంట్ భాస్కర్, దేవి కొండమ్మ సిబ్బంది, ఆశ వర్కులు పాల్గొన్నారు

ఏకలవ్య పాఠశాలల్లో 6వ తరగతి ప్రవేశాలకు కౌన్సెలింగ్ రేపు

పాడేరురూరల్, జూలై 2: ఐటీడీఏ పరిధిలోని 11 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 6వ తరగతిలో ప్రవేశాలకు ఈనెల 4వ తేదీన పాడేరు ఏపీఆర్ బాలికల పాఠశాలలో కౌన్సెలింగ్ నిర్వహించ నున్నట్టు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కౌన్సెలింగ్‌లో ప్రవేశ పరీక్షలలో ఇతర జిల్లాలలో ఎంపికైన విద్యార్థినీ, విద్యార్థులకు సొంత జిల్లాలో చేరేందుకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. ప్రవేశపరీక్షలో బాలురకు 63, బాలికలకు 65 మార్కులు లేదా అంతకంటే ఎక్కువ మార్కులు వచ్చిన విద్యార్థినీ, విద్యార్థులు వారి తల్లిదండ్రులతో పాటు ఒరిజనల్ సర్టిఫికెట్‌లతో 4వ తేదీ ఉదయం 10 గంటలకు చేరుకోవాలన్నారు. 11 ఏకలవ్య పాఠశాలల్లో బాలురకు 76, బాలికలకు 84 సీట్లు ఖాళీలు ఉన్నాయన్నారు. డుంబ్రిగుడ పాఠశాల్లో బాలురకు 14, బాలికలకు 12 సీట్లు, కొయ్యూరులో బాలురకు 10, బాలికలకు 10, అరకులో బాలురకు 6, బాలికలకు 5, పాడేరులో బాలురకు 9, బాలికలకు 2 ఖాళీలున్నాయన్నారు. అలాగే హుకుంపేటలో బాలురకు 4, బాలికలకు 9, జి.మాడుగులలో బాలురకు 4, బాలికలకు 5, చింతపల్లిలో బాలురకు 2, బాలికలకు 4, జీకేవీధిలో బాలురకు 5, బాలికలకు 5, ముంచంగిపుట్టులో బాలురకు 12, బాలికలకు 15, పెదబయలులో బాలురకు 6, బాలికలకు 9, అనంతగిరి మండలంలో బాలురకు 4, బాలికలకు 8 సీట్లు ఖాళీలు ఉన్నాయన్నారు. ఈ అవకాశాన్ని జిల్లా విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వెలుగు వీవోఏల సమస్యలు పరిష్కరించాలి

- మాజీ మంత్రి శ్రావణ్‌కుమార్‌కు వినతి


శ్రావణ్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న వెలుగు వీవోఏలు

అరకులోయ, జూలై 2: వీవోఏల సమస్యలను పరిష్కరించాలని, హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలని మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్‌కు వెలుగు సిబ్బంది కోరారు. మంగళవారం వెలుగు వీవోఏలు మాజీ మంత్రి కిడారిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. తమ సమస్యలను కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని కోరారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రతీ సమావేశానికి, ర్యాలీలకు తమను సమయపాలన లేకుండా వినియోగించుకొని, ఎటువంటి ప్రయోజనం చేకూర్చలేదన్నారు. వీవోఏలకు కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, గుర్తింపు కార్డులతోపాటు యూనిఫాంలు ఇవ్వాలని కోరారు. ఈ విషయాన్ని సంబంధిత మంత్రి దృష్టికి తీసుకువెళతానని మాజీ మంత్రి శ్రావణ్‌కుమార్ హామీ ఇచ్చారు.

ఆశాలకు వేతనాలు పెంచాలి

కొయ్యూరు, జూలై 2 : దశాబ్దాల కాలం నుంచి విధులు నిర్వర్తిస్తున్న ఆశ కార్యకర్తలకు రూ.26 వేలు వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అప్పలనాయుడు డిమాండ్ చేశారు. రాజేంద్రపాలెం పీహెచ్‌సీ వద్ద మంగళవారం ఆశ, కమ్యూనిటీ వర్కర్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ సమస్యలపై ప్రజాప్రతినిధులు, అధికారులకు వినతులు ఇస్తున్నా స్పందించలేదన్నారు. ఈ కార్యక్రమంలో లోత సరోజిని, ఎస్.నాగమణి, రత్నం, మల్లమ్మ, చిలకమ్మ, సావిత్ర తదితరులు పాల్గొన్నారు.

మూడేళ్ల లోపు పిల్లలకు అంగన్‌వాడీలో చేర్పించండి

కొయ్యూరు, జూలై 2 : గ్రామాల్లో మూడేళ్ల చిన్నారులను అంగన్‌వాడీల కేంద్రాల్లో చేర్పించాలని సీడీపీవో విజయకుమారి అన్నారు. మండలంలోని కన్నంపేట, బొర్రంపేట, కర్నికపాలెం, అంగన్‌వాడీల కేంద్రాలను మంగళవారం ఆమె సందర్శించారు. ఆయా కేంద్రాల్లో పిల్లల హాజరు, రోజు అందించే పదార్థాలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

యూ.చీడిపాలెంలో వైద్య శిబిరం

కొయ్యూరు, జూలై 2 : మండలంలోని యూ.చీడిపాలెం ఆశ్రమ పాఠశాలలో మంగళవారం వైద్యాధికారులు డాక్టర్లు ప్రకాశ్, హేమంత్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు హెచ్‌బీ పరీక్షలు నిర్వహించారు. రక్తహీనత గల ముగ్గురు విద్యార్థులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. జూన్ 29న స్ప్రేయింగ్ చేసిన గదులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'బుల్లయ్య సేవలు అభినందనీయం'


బుల్లయ్య, అన్నపూర్ణ దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, వివిధ సంఘాల నాయకులు

గూడెంకొత్త వీధి, జూలై 2: రింతాడ గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ పాఠశాల పీజీహెచ్ఎం పాటి బుల్లయ్య సేవలు అభినందనీయమని ఏపీ టీడబ్ల్యూటీయూ రాష్ట్ర అధ్యక్షుడు రేగం సూర్యనారాయణ అన్నారు. మంగళవారం పదవీవిరమణ పొందిన బుల్లయ్య, అన్నపూర్ణ దంపతులను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ పనిచేసే ప్రాంతంలో స్థానిక నివాసముంటూ విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దేందుకు బుల్లయ్య ప్రత్యేక కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీటీడబ్ల్యూటీయూ జిల్లా అధ్యక్షుడు నీలకంఠం, పీజీహెచ్ఎంల సంఘం జిల్లా అధ్యక్షుడు పూర్ణచంద్రరావు, పీజీహెచ్ఎం జేపీ కొండలరావు, గిరిజన ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు కుడుముల కాంతారావు, నాయకులు కుడుముల వెంకటరమణ, గసాడి పద్మనాభం, సన్యాసిరావు, జీకేవీధి, చింతపల్లి ఎంఈవోలు నారాయణరావు, తగ్గి సత్యనారాయణ పాల్గొన్నారు.

సేంద్రీయ ఎరువులు మేలు

డుంబ్రిగుడ, జూలై 2: మండలంలోని గిరి రైతులు రసాయనిక ఎరువులు కాకుండా సేంద్రీయ ఎరువులను వాడాలని కోర్రాయి సర్పంచ్ పి.కొములు సూచించారు. మంగళవారం అంజోడ గ్రామంలో గుల్లి రాగి విధానంపై గిరి రైతులకు ఉద్యానవన శాఖ అసిస్టెంట్ పి.సౌయిత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సంజీవని సంస్థ ప్రతినిధి పి.ఉల్లాస్ పాల్గొన్నారు.

మొబైల్ యాప్, వెబ్‌సైట్ ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

పాడేరురూరల్, జూలై 2: ఆంధ్రప్రదేశ్ తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) వినియోగదారులు విద్యుత్ బిల్లులను మొబైల్ యాప్, వెబ్‌సైట్‌ల ద్వారా చెల్లించవచ్చని సంస్థ చైర్మన్ ,మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీరాజ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌బీఐ మార్గదర్శకాలను అనుసరించి ఇక నుంచి ఫోన్ పే, జీ పే, పేటీఎం, ఇతర యూపీఐ యాప్స్ నుంచి విద్యుత్ బిల్లులు చెల్లించినపుడు ఏపీఈపీడీసీఎల్ పేరు కనిపించదు కావున వినియోగదారులు సంస్థ మొబైల్ యాప్ ఈస్ట్రన్ పవర్‌ను గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని, లేకుంటే సంస్థ వెబ్‌సైట్ నుంచి బిల్లులు చెల్లించవచ్చని పేర్కొన్నారు. బిల్లులు చెల్లించే వినియోగదారులు ఫోన్ పే, జీ పే, పేటీఎం, ఇతర యూపీఐ యాప్స్‌తో పాటు డెబిట్, క్రెడిట్, నెట్ బ్యాంకింగ్, క్యాష్ కార్డులు కూడా వాడుకోవచ్చని వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఆదివాసీ మాతృ బాషా విద్యా వలంటీర్లను రెన్యువల్ చేయాలి

పాడేరురూరల్, జూలై 2: జిల్లాలో విద్యా ప్రమాణాలు మెరుగుకు కృషి చేస్తున్న ఆదివాసీ మాతృ బాషా విద్యా వలంటీర్లను రెన్యువల్ చేయాలని కోరుతూ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.శ్రీను, జిల్లా నాయకులు పి.కుమారి, వి.చంద్రయ్య తదితరులు మంగళవారం ఐటీడీఏ పీవో వి.అభిషేక్‌కు వినతిపత్రం అందించారు.

సంక్షిప్తంగా..

ఆర్ఏఆర్ఎస్‌లో ఇద్దరు సీనియర్ శాస్త్రవేత్తల నియామకం


డాక్టర్ బాలహుసేన్‌రెడ్డి


డాక్టర్ బయ్యపురెడ్డి

చింతపల్లి, జూలై 2: ఆచార్య ఎన్‌జీ రంగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో ఇద్దరు సీనియర్ శాస్త్రవేత్తలు నియమితులయ్యారు. తాజా బదిలీల్లో తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో విస్తరణ విభాగం సీనియర్ శాస్త్రవేత్తగా పనిచేస్తున్న డాక్టర్ పి. బాల హుసేన్ రెడ్డి, గుంటూరు లాం పరిశోధన స్థానంలో సీడ్ సైన్స్ టెక్నాలజీ విభాగంలో పనిచేస్తున్న ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె. బయ్యపురెడ్డిలను చింతపల్లి బదిలీ చేశారు. ఈమేరకు ఇద్దరు శాస్త్రవేత్తలు మంగళవారం విధుల్లో చేరారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు విలేకరులతో మాట్లాడుతూ గిరిజన ప్రాంత రైతుల వ్యవసాయ ప్రగతి కృషి చేస్తామన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

జి.మాడుగుల, జూలై 2 : ప్రకృతి వ్యవసాయం చేసి లాభాలు పొందాలని ఐకేపీ ఏపీఎం సుందరమ్మ తెలిపారు. ఎం.నిట్టాపుట్టు రైతు సాధికార సంస్థ ఇన్‌చార్జి ఎం. ప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం వారపు సంతలో ప్రజలకు అవగాహన కల్పించారు. సేంద్రియ ఎరువులతో పండించిన కూరగాయలు తినడం వల్ల మంచి ఆరోగ్యం పొందవచ్చునన్నారు. అలాగే ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన వివిధ కూరగాయలు సంతల్లో విక్రయిస్తే మంచి ఆదాయం సమాకూరుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రామలింగం, సోమన్నదొర, కొండమ్మ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు కనీస వేతనాలివ్వాలి


సీలేరు పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు

సీలేరు, జూలై 2 : సీలేరు పంచాయతీ పారిశుధ్య కార్మికులకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాలంటూ సీఐటీయూ నాయకులు స్థానిక పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌కు మంగళవారం ఒక వినతిపత్రాన్ని అందజేశారు. మేజర్ పంచాయతీలో 8 మంది కార్మికులు పారిశుధ్యం, నీటి సరఫరా, వీధి దీపాలు వెలిగించడం వంటి పనులకు ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన గత కొన్ని సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నారు. వీరు చాలీచాలని వేతనాలతో ఆర్థిక ఇబ్బందులు పడుతూ అత్యంత దుర్భర జీవితాలను గడుపుతున్నారని, వీరికి కనీస వేతనం , ఉద్యోగ భద్రతను వారాంతపు సెలవులు, భద్రతా ఉపకరణాలను ఇవ్వాలని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ సీలేరు గౌరవాధ్యక్షుడు ఎస్‌కే సుభాన్, కార్యదర్శి టి విష్ణుకుమార్‌రాజు పాల్గొన్నారు.

కంటి సమస్యలపై అప్రమత్తంగా ఉండాలి

చింతపల్లి, జూలై 2: కంటి సమస్యలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏరియా ఆస్పత్రి ఈఎన్‌టీ వైద్యాధికారి డాక్టర్ చందన అన్నారు. మంగళవారం కంటి శస్త్రచికిత్సలు అవసరమైన 21మంది గిరిజనులకు ప్రత్యేక వాహనంలో విశాఖపట్నం అసోసియేటెడ్ ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా డాక్టర్ చందన మాట్లాడుతూ ఏరియా ఆస్పత్రిలో దృష్టి ఐకేర్ ద్వారా ఆప్టోమెట్రిస్ట్ కంటి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కంటి సమస్యలపై ప్రజలు అశ్రద్ధ చేయరాదన్నారు. గిరిజన ప్రజలు దృష్టి ఐకేర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆప్టోమెట్రిస్ట్ గాలి జగన్ పాల్గొన్నారు.

గన్నేరుపుట్టులో సీసీ రోడ్డుకు శంకుస్థాపన


సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన సర్పంచ్ శాంతికుమారి, వార్డు సభ్యులు

హుకుంపేట జూలై 2: మండలంలోని మఠం పంచాయతీ గన్నేరుపుట్టు గ్రామంలో రూ.18 లక్షలతో సీసీ రోడ్డు పనులకు సర్పంచ్ శాంతి కుమారి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి గన్నేరుపుట్టులో సీసీ రోడ్డు, డ్రైనేజీలు లేక ప్రజలు ఇబ్బంది పడేవారన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో వీటిని చేపడుతున్నట్టు ఆమె చెప్పారు. సీసీ రోడ్డు, డ్రైనేజీలకు శంకుస్థాపన చేయడంతో గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి మత్య కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

11న జీకేవీధి మండల సమావేశం

గూడెంకొత్తవీధి, జూలై 2: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 11న నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఉమామహేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎంపీపీ బోయిన కుమారి అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు హాజరుకావాలన్నారు.

గోపవరంలో ఇంటింటా తనిఖీలు

కొయ్యూరు, జూలై 2: మండలంలోని డౌనూరు వైద్యాధికారి వరప్రసాద్ మంగళవారం పీహెచ్‌సీ పరిధిలోని గోపవరం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి తనిఖీలు నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రతలపై గిరిజనులకు అవగాహన కల్పించారు. వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పుల దృష్ట్యా వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.